హనుమాన్ ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

చంపాపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామిని మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ. ప్రియదర్శిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. న్యాయమూర్తికి ఆలయ పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు, శేషవస్త్రాలు అందించి, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.



శిక్షణ ఇస్తున్న ముషీరాబాద్ మండలం డిప్యూటీ డీఈవో చిరంజీవి, పక్కన సైదాబాద్ మండలం డిప్యూటీ డీఈవో రాధాకృష్ణ తదితరులు

పదో తరగతి పరీక్షల నిర్వహణపై శిక్షణ

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు, అసౌకర్యాలు కలుగకుండా సాఫీగా సాగేందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ముసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో నిర్వహించారు. పరీక్షల నిర్వాహణపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పరీక్షల నిర్వాహణ అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్‌రావు, సైదాబాద్, ముషిరాబాద్, హిమాయత్‌నగర్ మండలాల డిప్యూటీ డీఈవోలు చిరంజీవి, టి.రాధకృష్ణ, ఎం.విజయలక్ష్మీ, అంబర్‌పేట మండలం డిప్యూటీ ఐవోఎస్ నిజాముద్దీన్, కోఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సైదాబాద్ మండలంలో 22 పరీక్షా కేంద్రాలు, హిమాయత్‌నగర్ మండలంలో 26 పరీక్షా కేంద్రాలు, నాంపల్లిలో 20 పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పరీక్షా సమయంలో మొబైల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని శిక్షణ కార్యక్రమంలో ఆదేశాలు జారీచేశారు.



హయత్‌నగర్ సీఐగా బదిలీపై వచ్చిన రామకృష్ణను మంగళవారం హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పారంద స్వామి, బోడ నరసింహ, సాయి యాదవ్, శేఖర్‌లు ఉన్నారు

- హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలలో భాగంగా సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌రావు మల్టీజోన్‌కు బదిలీ కాగా నాచారం ఇండస్ట్రియల్ ప్రాంతంలో పనిచేసిన నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి సరూర్‌నగర్‌కు బదిలీపై వచ్చారు.

ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు.. సౌకర్యాలు మాత్రం కల్పించడంలేదు

● కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ నగరవాసుల నుంచి ముక్కుపిండి ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారనీ, అవి సకాలంలో చెల్లించిన వారి నుంచి అపరాధ రుసుము కూడా వసూలు చేస్తున్నారని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. కానీ ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలేదని ఆమె విమర్శించారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆస్తిపన్ను మదింపు చేసేటప్పుడు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలలో వసూలు చేసినట్లుగానే సరూర్‌నగర్‌లో కూడా ఎలా వసూలు చేస్తారని ఆమె ప్రశ్నించారు. ప్రజల నుంచి ఆస్తిపన్ను వసూలు చేసినప్పుడు అభివృద్ధి పనుల విషయంలో వారికి జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీపై లేదా అని ఆమె నిలదీశారు. వీధి కుక్కల బారిన పడి ఎంతోమంది చిన్నారులు బలవుతున్నా జీహెచ్ఎంసీ మొద్దు నిద్ర వీడటం లేదని ఆమె మండిపడ్డారు.

జీహెచ్ఎంసీ, జలమండలి మధ్య సమన్వయలోపం

● కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల మధ్య సమన్వయలోపంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. డివిజన్‌లో మురుగు సమస్య నివారణకు చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులు ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని గుర్తు చేశారు. డ్రైనేజీ, వరదనీటి, తాగునీటి పైప్‌లైన్ల పనులతో అంతర్గత దారులు తవ్వేశారని, మరమత్తులు చేపట్టాలని కోరితే జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించడం లేదన్నారు. సత్యానగర్, బృందావన్ కాలనీల్లో 20 రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు.



స్విచ్ ఆన్ చేసి నీటి బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నీటి బోరును ప్రారంభించిన కార్పొరేటర్

వనస్థలిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్‌జీవోస్ కాలనీలోని రంగస్థల కళాకారుల సంఘం భవన ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ బోరును స్విచ్ ఆన్ చేసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాకారులు పంపన వెంకటేశ్వర్లు, మంగపతిరావు, సీహెచ్‌వీఆర్‌కే మూర్తి, పుండరి, సూర్యప్రకాశ్, జీహెచ్ఎంసీ ఏఈ నరేందర్, తేజ, గోపాలకృష్ణ, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీతాశ్రీకాంత్‌గౌడ్

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 9వ డివిజన్‌లోని గ్రీన్‌హోమ్స్ కాలనీలో కొత్తగా చేపట్టనున్న తాగునీటి పైపులైన్ నిర్మాణం పనులను మంగళవారం కార్పొరేటర్ నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని కాలనీల్లో నీటి సమస్య నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ బడంగ్‌పేట్‌శాఖ అధ్యక్షుడు సుభాన్ యాదవ్, అశోక్, కాలనీ ప్రతినిధులు చలమారెడ్డి, సునీల్, కిష్టయ్య, పాల్గొన్నారు.



కొత్తపేట చౌరస్తాలోని సిరిపురం యాదయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి రామ్మోహన్‌గౌడ్, బేర బాలకిషన్ తదితరులు



సిరిపురం యాదయ్యకు నివాళులర్పిస్తున్న యువజన నేత కార్తీక్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అశోక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, అంకిరెడ్డి తదితరులు



సిరిపురం యాదయ్యకు నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సర్దార్ పుటం పురుషోత్తంరావు, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్ తదితరులు

తెలంగాణ అమరుడు

సిరిపురం యాదయ్యకు ఘన నివాళి..

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుడు సిరిపురం యాదయ్య 14వ వర్ధంతి సందర్భంగా కొత్తపేట చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యమకారులు, విద్యార్థులు నివాళులర్పించారు.

- ఎల్‌బీనగర్ జోన్ బృందం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)



సిరిపురం యాదయ్యకు నివాళులర్పిస్తున్న గీతా కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి, ఆరుట్ల సురేష్, సిద్దు ముదిరాజ్, వీఎంహోం విద్యార్థులు



సిరిపురం యాదయ్య వర్ధంతిని పురస్కరించుకుని హయత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా ఉద్యమకారుల ఫోరం నాయకులు



తుర్కయంజాల్ చౌరస్తాలో సిరిపురం యాదయ్యకు నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు

మన్సూరాబాద్ నాయిబ్రాహ్మణ పోచమ్మ సహకార సంఘం కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ నాయిబ్రాహ్మణ పోచమ్మ సహకార సంఘం నూతన కమిటీ మంగళవారం ఎన్నికైనట్లు ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా అమరోజు రవి కుమార్, ఉపాధ్యక్షుడిగా తమ్మునూరు శ్రీనివాస్, కార్యదర్శులుగా చెన్న నరేష్, అక్కనపల్లి సుధాకర్, కమిటీ డైరెక్టర్లుగా గడల శ్రీనివాస్, కొడిదల శ్రీను, కామాజి రమేష్, సభ్యులుగా ప్రసన్న, సురేష్, అక్కనపల్లి రాజు, బాలరాజు, అనిల్, జాని, శ్రీకాంత్, మహేష్, సురేష్, శోభన్‌బాబు, రాజేందర్ ఎన్నికైనట్లు తెలిపారు.

సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

చంపాపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ నిర్మలానగర్‌కాలనీలోని ప్రసన్నాంజనేయ శివ సీతారామచంద్రస్వామి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఆలయంలో యాగశాల ప్రదక్షణము, ప్రాతఃకాల మంటప పూజలు, జపములు, అవాహిత దేవతల హోమాలు, ప్రదోష పూజ, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలను అర్చకులు, పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మలానగర్ కాలనీ సంక్షేమ సంఘం, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమతామూర్తి కేంద్రంలో ప్రారంభమైన సమతాకుంభ్ - 2024

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధి ముచ్చింతల్‌లో గల సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతాకుంబ్ - 2024 ద్వితీయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక గురువు త్రిదండి రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం అర్థాభిషేకం ఘనంగా జరిగింది. సువర్ణ మూర్తి భగవత్ రామానుజస్వామికి ఉత్సవారంభ స్నపనం నిర్వహించారు. ఆరుద్ర అనేది రామానుజుల అవతార నక్షత్రం అని, ఈ క్షేత్రానికి అధిష్ఠాన దేవుడు శ్రీరామచంద్రుడని, ప్రతీ ఆరుద్ర నక్షత్రం నుంచి చిత్త నక్షత్రం వరకు ఈ బ్రహోత్సవాలు నిర్వహిస్తామని చినజీయర్ స్వామి తెలిపారు. కాగా 108 దివ్య దేశాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన జీయర్‌స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అయోధ్య రాముడు మాత్రం పుర్వసు నక్షత్రంలో జన్మించాడన్నారు. తిరునక్షత్ర ప్రయుక్త తిరుమంజనంతో శుభారంభం జరుగుతోందని ఆయన తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని స్వామిజీ తెలిపారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

భార్య బతికి ఉండగానే చనిపోయిందని మరో వివాహం

● నిత్య పెళ్లికొడుకుని నిలదీసిన మొదటి భార్య బంధువులు

● సరూర్‌నగర్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పెద్దలు కుదుర్చిన వివాహం చేసుకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. తర్వాత భార్యకు నాలుగుసార్లు గర్భం వస్తే కడుపులో ఉన్నది మగ, ఆడ బిడ్డా అని చట్ట విరుద్ధంగా నాలుగుసార్లు స్కానింగ్ చేయించి ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. అంతటితో ఆగకుండా భార్య బతికి ఉండగానే చనిపోయిందని నమ్మబలికి మరో వివాహం చేసుకున్నాడు. అనుమానం వచ్చిన మొదటి భార్య ఆరా తీయగా మరో వివాహంచేసుకున్నట్లు బయటపడింది. దీంతో ఆమె తనకు జరిగిన అన్యాయంపై నిత్యపెళ్లికొడుకు నివాసముంటున్న ఇంటిముందు ఆందోళనకు దిగింది. సరూర్‌నగర్ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సరూర్‌నగర్ మహిళ పీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేఖ, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హైకోర్టు న్యాయవాదిగా చలామణి అవుతున్న నాగోల్ జైపురి కాలనీ నివాసి అమరేందర్ (30)కి 2017లో పెద్దలు కుదుర్చిన సంబంధంతో పల్లవితో వివాహం జరిపించారు. అమరేందర్ భార్య పల్లవితో తన తల్లిదండ్రులతో కాకుండా మరో ఇంట్లో ఉంటున్నాడు. అనంతరం ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. కొడుకు కావాలన్న భర్త అమరేందర్ కోరిక మేరకు భార్యపల్లవి నాలుగుసార్లు గర్భం దాల్చింది. చట్టవిరుద్ధంగా చేయించిన స్కానింగ్‌లో నాలుగుసార్లు ఆడపిల్ల అని తేలడంతో అబార్షన్ చేయించాడు. భార్య పల్లవికి మగ పిల్లవాడు పుట్టడన్న సాకుతో గతేడాది నవంబరులో భార్య పల్లవి బతికి ఉండగానే చనిపోయిందని మరో యువతి కుటుంబాన్ని నమ్మించి రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలున్న భార్య పల్లవి దగ్గరికి కొన్ని రోజులుగా రావడం మానేశాడు. ఇంటికి సరిగ్గా రాకపోవడంతో భర్త అమరేందర్ తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి అడగగా తమకేమి తెలియదన్నట్లుగా బుకాయించారు. భర్త అమరేందర్ ఎక్కడికి వెళ్తున్నాడో తెలుసుకోగా రెండో పెళ్లి చేసుకున్నట్లు బయటపడడంతో నివ్వెరపోయిన మొదటి భార్య పల్లవి కన్నీరు మున్నీరైంది. తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె తన తల్లిదండ్రులు, బంధువులకు చెప్పుకుంది. దీంతో బంధువులందరూ అమరేందర్‌ను వెంబడించగా బతికి ఉన్న భార్య పల్లవి చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నట్లు బయటపడడంతో ఆందోళనకు దిగారు. నిత్య పెళ్లికొడుకుగా మారిన అమరేందర్‌ను అతని తండ్రి రిటైర్డ్ మెజిస్ట్రేట్ మహేందర్‌ను నిలదీశారు. రెండో భార్యగా వచ్చిన యువతిని కూడా ప్రశ్నించగా పై విషయాలు బయటపడ్డాయి. దీంతో కోపోద్రిక్తురాలైన మొదటి భార్య పల్లవి తాను బతికి ఉండగానే చనిపోయినట్లుగా నమ్మబలికించి రెండో వివాహం చేసుకుని మోసం చేశాడని భర్త అమరేందర్‌పై సరూర్‌నగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిన తర్వాత తెలంగాణ రైతురాజ్య సమితిగా (టీఆర్ఎస్) రిజిస్టర్ చేయించుకోవడంతోపాటు తన తండ్రి రిటైర్డ్ మెజిస్ట్రేట్ అంటూ పలువురిని మోసం చేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో వివరించింది. తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకుంటుంది. ఈమేరకు ఇన్‌స్పెక్టర్ సురేఖ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైతులను మోసం చేసిన బీజేపీ

● జస్టిస్ చంద్రకుమార్

పంజాగుట్ట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇస్తామని 2014 ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టోలో పేర్కొని రైతులను మోసం చేసిందని, పదేళ్ల అధికారంలో ఉన్నా రైతుల డిమాండ్లను పట్టించుకోకుండా వారి ఉద్యమాన్ని అణచివేయడానికి క్రూరమైన పద్ధతులు అమలు చేస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు. మోదీ పదేళ్ల పాలనలో 7.50 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, బడా కార్పొరేట్ సంస్థలకు 14 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని వారు ఆరోపించారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ రైతుల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ సమితి అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేన అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు జి.రవీందర్, తెలంగాణ సమాఖ్య అధ్యక్షుడు కరుణాకర్ దేశాయ్, వివిధ సంఘాల ప్రతినిధులు ప్రొఫెసర్ పద్మజా షా, పాశం యాదగిరి నైనాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలంతా చల్లగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. మంగళవారం నగర శివారులోని గౌరెల్లి, పెద్దఅంబర్‌పేట్‌లోని రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, ఉప్పలమ్మ తల్లి గ్రామ దేవతలకు శ్రీనివాస్‌గుప్త, స్వప్న దంపతులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల సాయికిరణ్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు

గ్రూప్-1 ద్వారా 1,600 పోస్టులు భర్తీ చేయాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్-1 ద్వారా 1,600 పోస్టులు భర్తీ చేయాలని రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గ్రూప్-1 ద్వారా 563 పోస్టుల భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, కానీ కరెక్టుగా లెక్కిస్తే 1,600 పైగా పోస్టులు వస్తాయని ఆయన అన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా జిల్లాలు ఏర్పడ్డ కారణంగా భారీ సంఖ్యలో గ్రూప్ 1, 2, 4 పోస్టులు ఏర్పడతాయని, కొత్త జిల్లాలకు, మండలాలకు, మునిసిపాలిటీకు పోస్టులు మంజూరు చేయాలని, గ్రూప్-1 పోస్టులు 50 శాతం, గ్రూప్-2 పోస్టులు 30-40 శాతం డైరక్ట్ రిక్రూట్‌మెంట్ కింద భర్తీ చేయాలన్నారు. ఒకే దఫా గ్రూప్ 1, 2, 3, 4 పోస్టులతో పాటు టీచర్, లెక్చరర్, ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేస్తున్నందున మెరిట్ అభ్యర్థులు ఈ పోస్టులన్నింటికీ ఎంపికవుతారని, ఒకే పోస్టును ఎంచుకోవడం వల్ల మిగతా పోస్టులు బ్యాక్‌లాగ్ కింద పడిపోతాయని తెలిపారు. కాబట్టి ఒకేసారి ఫలితాలు ప్రకటించడం, ఆప్షన్ పద్ధతి, వెయిటింగ్ లిస్టు కాల పరిమితి ప్రవేశ పెట్టడం వంటి చర్యలు తీసుకుంటే పోస్టులు మిగిలిపోకుండా భర్తీ అవుతాయని ప్రభుత్వానికి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రెండు రోజులపాటు జాతీయ సెమినార్

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కోసం స్మార్ట్ టెక్నాలజీస్ ఫిబ్రవరి 22-23 తేదీల్లో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె సింగ్ తెలిపారు. ఇండియన్ సొసైటీ అఫ్ ఆగ్రో ఫిజిక్స్-క్రీడా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, బిగ్ డేటా అసలిటిక్స్, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్, సెన్సార్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్కర్లతో సహా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ తదితర అంశాలపై ఈ సెమినార్ ఉంటుందని డైరెక్టర్ తెలిపారు.

అంతర్ జిల్లా కబడ్డీ విజేతగా రంగారెడ్డి బాలికల జట్టు



విజేతగా నిలిచిన రంగారెడ్డి జిల్లా బాలికల జట్టుతో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, సంయుక్త కార్యదర్శి రవికుమార్, చంద్రమోహన్

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో రంగారెడ్డి జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. సూర్యాపేట చింతలపాలెంలో నిర్వహించిన 33వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా బాలికల జట్టు భద్రాద్రి కొత్తగూడెం జట్టుపై 48-18తో విజయం సాధించారు. విజేతగా నిలిచిన రంగారెడ్డి జిల్లా బాలికల జట్టును కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, సంయుక్తకార్యదర్శి రవికుమార్, జిల్లా అసోసియేషన్ సంయుక్తకార్యదర్శి చంద్రమోహన్‌లు అభినందించారు.



రోడ్డు ఆక్రమణపై సబితారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు సిద్దప్ప తదితరులు

రోడ్డు ఆక్రమణపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లోని నందిహిల్స్‌కాలనీ రోడ్డు నంబర్ 20లోని ఆక్రమణలపై కాలనీప్రతినిధులు మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి ఫిర్యాదు చేశారు. రోడ్డు ఆక్రమణలను తొలగింపజేయాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ రోడ్డు కేవలం 20అడుగులే ఉండగా, పలువురు ప్లాట్ల యజమానులు అటూ ఇటూ ఆక్రమించుకోవడంతో ప్రస్తుతం 6 నుంచి 8 అడుగులు మాత్రమే మిగిలిందని, వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి తగినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సబితారెడ్డి వారికి హామీ ఇచ్చారు.

నేడు వైజ్ఞానిక ప్రదర్శన...

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని ది స్టూడెంట్ సర్వీస్ గిల్డ్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం జరగనున్న వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, మీర్జా రియాజ్, కార్పొరేటర్ అలందార్, చార్మినార్ డిప్యూటీ డీఈవో నెహ్రూబాబు, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా విచ్చేయనున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ప్రదర్శన తిలకించేందుకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి: సీపీఐ



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

సైదాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలనీలో రౌద్రీ సొసైటీ చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సీపీఐ నేతలు మంగళవారం సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీని కలిసి వినతిపత్రం సమర్పించారు. కోర్టులో వివాదం పెండింగ్‌లో ఉండగా నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు శంకర్ నాయక్, షేక్‌మహమూద్, సత్రీబాయి, అంజయ్య ఉన్నారు.

ఆస్తిపన్ను వసూలుపై దృష్టి పెట్టండి

● సిబ్బందికి మీర్‌పేట్ కమిషనర్ సూచన

సరూర్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో మార్చి 31 నాటికి వంద శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని మునిసిపల్ కమిషనర్ బి.చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం రెవెన్యూ, శానిటేషన్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వ్యాపార సంస్థ ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలని, వారి నుంచి లైసెన్స్ ఫీజును క్రమం తప్పకుండా వసూలు చేయాలని అన్నారు. మొండి బకాయిదారులకు నోటీసులు పంపించాలని, అప్పటికీ పన్ను కట్టకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు.

23 వరకు ఉచిత దంత పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) డెక్కన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నోటీ కేన్సర్‌పై దంత వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించింది. మలక్‌పేటలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ(ఏపీఎంసీ) వద్ద దీనిని ఏర్పాటు చేశామని, శుక్రవారం వరకు అందుబాటులో ఉంటుందని ఐడీఏ కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఓరల్ కేన్సర్ పరీక్షలు, స్క్రీనింగ్, అవగాహన, నిర్ధారణ, చిగుళ్ల వ్యాధులు, సాధారణ దంత సమస్యల పరీక్షలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చేస్తారని తెలిపారు. అనుమానిత నోటీ కేన్సర్ కేసుల్లో అవసరమైన బయాప్సీలు కూడా సేకరిస్తామన్నారు.

సెల్‌ఫోన్ షాప్‌లో నగదు దొంగతనం, కేసు నమోదు

వనస్థలిపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ షాప్‌లో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి అదేషాప్‌లో సుమారు 5 నుంచి 6 లక్షల రూపాయల నగదును దొంగలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాప్ యజమాని, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం సుష్మా రోడ్డులో ప్రవీణ్‌రెడ్డి(43) అనే వ్యక్తి శ్రీరామ మొబైల్‌షాప్ నిర్వహిస్తున్నాడు. తన షాపులో కొంతకాలంగా బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన రాజేష్ నాయక్(24) పనిచేస్తున్నాడు. అయితే షాప్‌లో యజమాని లేని సమయంలో క్యాష్ కౌంటర్ నుంచి ప్రతిరోజు కొంత నగదును దొంగలించేవాడు. షాప్ యజమానికి అనుమానం రావడంతో క్యాష్ కౌంటర్‌లో 2500 నగదును ఉంచి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి కౌంటర్‌లో నగదు లేదు. దీంతో అనుమానం వచ్చిన షాప్ యజమాని సీసీ కెమెరాలలో రికార్డ్ అయిన వీడియోలో పరిశీలించగా షాప్‌లో పనిచేస్తున్న రాజేష్ నాయక్ తీసుకున్నట్లు కనిపించింది. దీంతో షాప్ యజమాని రాజేష్ నాయక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.